# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :06 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 27-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## రైతు పొలంలో నోట్ల కట్టలు..?

నల్లగొండ,రోజుమాదిరిగానే పొలంలోకి వెళ్లిన రైతు ఒక్కసారిగా అక్కడ నోట్ల కట్టలు ప్రత్యక్షమవ్వటంతో ఒక్కసారి షాక్‌కు గురయ్యాడు. ఇన్నీ రోజులు పడ్డ కష్టాలు ఈ డబ్బులతో తీరిపోతాయని ఆశపడ్డాడు.. కానీ చివరకు అవి అసలు నోట్లు కాదు.. నకిలీ నోట్లని తేలడంలో ఆ రైతు ఆశలు కాస్త ఆవిరయ్యాయి. ఈ ఘటన నల్గొండ జిల్లా దామరచర్ల మండలం పొత్తలపాలెం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఓ రైతు మంగళవారం ఉదయం తన పంట పొలానికి బయల్దేరాడు. నార్కట్‌పల్లి-అద్దంకి రోడ్డు వెంట తన దాయాది పొలంలోసుమారు 40 వరకు రూ.500 నోట్ల కట్టలు పేర్చి ఉన్న సంచిని గుర్తించాడు. అందులో ఉన్న డబ్బును మరో రైతుతో కలిసి పరిశీలించి చూడగా.. అవి నకిలీ నోట్లను తేలింది. విషయం పోలీసుల వరకూ వెళ్లడంతో మిర్యాలగూడ గ్రామీణ సీఐ ఘటనా స్థలానికి చేరుకున్నాడు. పొలంలోని రూ. 500 నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫేక్ కరెన్సీపై 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ముద్రించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## అది ఈ సీఎం వల్లే కాదు.. ఢిల్లీ పార్టీ ముత్తాతలకూ సాధ్యం కాదు..



హైదరాబాద్,చేతకాని పాలనతో తెలంగాణను పూర్తిగా ఆగం చేసి, వాస్తవాలను బయటపెట్టిన అధికారులపై కక్షకట్టడం ముఖ్యమంత్రి మూర?త్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్) రిపోర్టుతో బీఆర్ఎస్ దార్శనిక పాలనకు, దద్దమ్మ కాంగ్రెస్ పాలనకు ఉన్న స్పష్టమైన తేడా, నాలుగు కోట్ల సమాజం ముందు బట్టబయలు కావడంతో ముఖ్యమంత్రికి మింగుడుపడటం లేదని అన్నారు.బీఆర్ఎస్ హయాంలో సాధించిన ఘనమైన గతాన్ని తొక్కిపెట్టడం, అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడం ఎవరికీ సాధ్యం కాదని ఈ సీఎం గుర్తుపెట్టుకోవాలని కేటీఆర్ స్పష్టం చేశారు. 14 నెలలుగా ప్రధాన ప్రతిపక్షంపై సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చాలదన్నట్టు, ఇప్పుడు అధికార యంత్రాంగంపై కూడా వేధింపులకు దిగడానికి సీఎంకు సిగ్గనిపించడం లేదా? అని నిలదీశారు. తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని, తలకు మాసిన నిర్ణయాలతో దివాళా తీసే స్థితికి తెచ్చి ఇప్పటికే క్షమించరాని పాపాన్ని మూటగట్టుకున్నారని తెలిపారు. వాస్తవ గణాంకాలను జీర్ణించుకోలేక, తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ సర్కారు చేస్తున్న ఈ చిల్లర చేష్టలు మానుకుంటే మంచిదని హితవు పలికారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయ రంగంలో సాధించిన విప్లవం, పారిశ్రామిక రంగంలో పరుగులు పెట్టిన ప్రగతి పథం.. ప్రజల గుండెల్లో శాశ్వతంగా పదిలమని కేటీఆర్ అన్నారు. కేవలం వెబ్‌సైట్ నుంచి రిపోర్టులను తొలగించినంత మాత్రాన, చేయని తప్పునకు అధికారులపై వేటు వేసినంత మాత్రాన.. తెలంగాణ పదేళ్ల ముఖచిత్రాన్ని, చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన స్వర్ణయుగాన్ని చెరిపేయడం ఈ ముఖ్యమంత్రి వల్లే కాదు..ఢిల్లీ పార్టీ ముత్తాతలకు కూడా సాధ్యం కాదని చెప్పారు.

36సార్లు ఢిల్లీకి పోయినా.. 3 రూపాయలు తెచ్చింది లేదు..

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది కార్మికులు చిక్కుకుంటే.. ఎన్నికల ప్రచారంలో మునిగి తేలావని మండిపడ్డారు. మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్నామని కార్మికులు వాపోతుంటే ఎన్నికల ప్రచారం ముగించుకుని నిమ్మలంగా మళ్లీ హస్తిన బాటపట్టావని అన్నారు.సొరంగంలో సహాయక చర్యలు ఒక్కడుగు ముందుకు .. వందడుగులు వెనక్కి అన్నట్లుగా ఉందని కేటీఆర్ విమర్శించారు. అక్కడ ఆక్సిజన్ లేదు.. కన్వేయర్ బెల్టు తెగిపోయిందని తెలిపారు. 96 గంటలు దాటినా ఒక్కడుగూ ముందుకు పడటం లేదని తెలిపారు. కాళేశ్వరం పర్రెల మీద శ్రీశైలం అగ్నిప్రమాదం మీద కారు కూతలు కూసి, విషపు రాతలు రాసిన మేధావుల నోళ్లు ఎస్ఎల్‌బీసీ విషయంలో మాత్రం నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.హస్తిన యాత్రలు మాని.. ఆ కార్మికుల గోడు వినాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. ఆ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు. అక్కడ చిక్కుకున్నవి సాధారణ ప్రాణాలు కాదు .. ఈ జాతి సంపద అని స్పష్టం చేశారు.

## టన్నెల్ వర్క్ నిపుణులతో మంత్రులు ఉత్తమ్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష



మహబూబ్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం నుండి, శ్రీశైలం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో జరిగిన ప్రమాద సంఘటనలో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా తీసుకురావడానికి చర్యలను ముమ్మరం చేసింది. ఎంతటి ఉన్నతస్థాయి పరిజ్ఞాన్నైనా ఉపయోగించి సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావాలన్న రాష్ట్రముఖ్యమంత్రి ఆదేశానుసారం న్యూఢిల్లీలోని బోర్డర్స్ రోడ్స్ ఆర్గనైజేషన్, టన్నెల్ వర్క్ లో నిపుణులైన వారిని ప్రత్యేకంగా పిలిపించారు.ఇవాళ సంఘటన స్థలానికి చేరుకున్న రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి, జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ , టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీతో సహాయ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలను మంత్రులు సమీక్షించారు. డీబీఎం వరకు చేరే మార్గాలను సహాయక బృందాలు పర్యవేక్షిస్తున్నట్లు మంత్రులకు అధికారులు వివరించారు. సహాయక చర్యలకు ఆటంకంగా వున్న బురద నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఢిల్లీ నుంచి వచ్చిన ఆర్మీ అధికారులు కల్నల్ బ్లాక్ స్మిత్ మెహ్రా, లెఫ్టినెంట్ కల్నల్ హార్పల్, ఎన్డీఆర్ఎఫ్ డీఐజీ మోహ్సాన్ షహది, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న, నేవీ అధికారి వీకే ప్రసాద్, రాబిన్సన్ టన్నెల్ అధికారి గ్లెన్, ర్యాట్ మైనర్స్ బృందం ప్రతినిధి ఫిరోజ్ కురేషి ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు నితీష్ కుమార్ కీలక నిర్ణయం..!



బీహార్: ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికార ఎన్డీఏ కూటమితో సహ ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమైపోయాయి. ఇప్పటికే ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం ప్రారంభించేశారు.ఇదిలా ఉంటే ఎన్నికలకు కొన్ని నెలలే ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్.. కేబినెట్ విస్తరణకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. బీహార్ బీజేపీ చీఫ్ దిలీప్ జైస్వాల్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. రెవెన్యూ మంత్రి పదవికి దిలీప్ జైస్వాల్ బుధవారం రాజీనామా చేశారు. బీహార్‌లో బడ్జెట్ సమావేశాలకు కేవలం రెండు రోజుల ముందు ఈ ప్రకటన వచ్చింది. దీంతో బీహార్‌లో మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు మొదలయ్యాయి.ఒకే వ్యక్తి.. ఒకే పదవి సూత్రంతో మంత్రి పదవి నుంచి వైదొలిగినట్లు దిలీప్ జైస్వాల్ పేర్కొన్నారు. బీజేపీ సూత్రాన్ని అనుసరించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఇక మంత్రివర్గ విస్తరణ.. నితీష్ కుమార్ హక్కు అన్నారు.ఇదిలా ఉంటే నితీష్ కుమార్.. మంత్రివర్గ విస్తరణకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. కేబినెట్‌లో ఐదు లేదా ఆరుగురు మంత్రులు ఉండే అవకాశం ఉందని, కనీసం నలుగురు బీజేపీకి చెందినవారుంటారని వర్గాలు తెలిపాయి. సంజయ్ సరోగి, రాజు సింగ్, అవధేష్ పటేల్, జిబేష్ కుమార్, అనిల్ శర్మ వంటి ఎమ్మెల్యేలకు నితీష్ మంత్రివర్గంలో స్థానం కల్పించవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే అక్టోబర్ లేదా నవంబర్ బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎన్డీఏ ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ పేరు ప్రకటించాలని డిమాండ్ పెరుగుతోంది. అయితే దీనికి బీజేపీ సుముఖంగా లేనట్లుగా తెలుస్తోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకుంది. దీంతో సీఎం పదవిని బీజేపీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం బీహార్‌లో జేడీయూకి సీట్లు తక్కువగా ఉన్నాముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ కొనసాగుతున్నారు. ఈసారి అది సాధ్యమవుతుందో లేదో చూడాలి.

## ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి..



మెదక్ : రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల మహాశివరాత్రి జాతర సందర్భంగా వనదుర్గభవాని మాతకు రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టు వస్త్రాలు సమర్పించారు..ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు, ఆలయ ఈవో చంద్ర శేఖర్ ఘన స్వాగతం పలికారు. మంజీరా నది పాయలలో ఏర్పాటు చేసిన శివుడు, లింగం, గోవుల భారీ సెట్టింగ్. వద్ద మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అమ్మవారి ఆలయంలో శివరాత్రి జాగారాలు, పూజలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు..

ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయని తెలిపారు. భక్తులు మెచ్చే కోరిన కోరికలు తీర్చే దేవతగా పిలవబడే వనదుర్గ అమ్మవారి జాతరకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పిల్లాపాపలతో జాతరకు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోతాయన్నారు. వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, జాగారాలు ఉండేందుకు భక్తులు చేరుకున్నారని వివరించారు. వీరంతా వనదుర్గ గుడి ప్రదేశంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద బస చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, బస్సులు, విద్యుత్ దీపాలతో అలంకరణ, భక్తులకు త్వరగా దర్శనం కల్గించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ క్రమంలో ఏడుపాయల్లో భక్తుల రద్దీ నెలకొందని చెప్పారు. జాతర సందర్భంగా వనదుర్గా భవాని మాత ప్రధాన ఆలయాన్ని, మండపాన్ని, ధ్వజస్తంభాన్ని రంగు రంగుల పువ్వులతో శోభాయమానంగా అలంకరించాలన్నారు.ఏడుపాయల మహా జాతర ప్రధానంగా మూడు రోజులు జరుగుతుంది. నేడు మహాశివరాత్రి, రెండో రోజు జాతర వేడుకల్లో ప్రధాన ఘట్టమైన బండ్ల బోనాలు ఊరేగింపు,మూడో రోజు ఆదివారం రథోత్సవం ఉంటాయన్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను కలెక్టర్ నేతృత్వంలో సంబంధిత ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాగునీటి వసతి, టాయిలెట్లు, బస్సులు, హెల్త్ క్యాంప్‌లు, గజ ఈతగాళ్లు ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



వేములవాడ: ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో మొదలైన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన అభివృద్ధి కొనసాగాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణకు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. వేములవాడ అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం కేసీఆర్ రూ.250 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి ఆగవద్దని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గుడి చెరువు వద్ద 30 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆలయానికి అందించిందని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి జరగడం లేదని స్థానికులు చెబుతున్నారని, కాబట్టి అక్కడ అభివృద్ధి పనులను కొనసాగించి త్వరగా పూర్తిచేయాలన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా అంటేనే చేనేత జిల్లాగా పేరు పొందిందని, చేనేత కార్మికుల కోసం నాడు మంత్రిగా కేటీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం లేదని, తద్వారా సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, అన్ని నియోజకవర్గాలను ప్రభుత్వం సమానంగా చూడాలని సూచన చేశారు. సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ వేధింపులు ఎక్కువయ్యాయని, కేటీఆర్ ఫోటో పెట్టుకున్నందుకు టీ స్టాల్‌ను తీసేయించిన దుర్మార్గపు ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఇంత భేదభావం అక్కరలేదని, తక్షణమే ఇట్లాంటి కక్షపూరిత వ్యవహారాలను విరమించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

## కుంభమేళాలో హరమరమహదేవ్..భారీగా తరలివచ్చిన భక్తజనం



ప్రయాగ్‌రాజ్,ఫిబ్రవరి26: ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా మొదలైన మహాకుంభమేళాకు చివరి రోజు కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు పుణ్యస్నానాలకు పోటెత్తారు. పుణ్యతిథి కావడంతో భారీగా భక్తుల తరలివచ్చారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక ఇక ముగియనుంది. ఈక్రమంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. ఇప్పటివరకు 64 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. ఈ కుంభమేళాలో నేడు చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికారులు భక్తులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలని కోరారు. ఇక, ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఇదిలాఉండగా.. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్ గా అధికారులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దీన్ని అమలుచేశారు. స్థానికుల కోసం నిత్యావసర సరకులు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బుధవారం 350 రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. జనవరి 13న ప్రారంభమైన ఈ కుంభమేళా దాదాపు 45 రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటికే రికార్డ్ స్థాయిలో 63.36 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవంగా కుంభమేళా నిలిచింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర కోట్లాది మంది భక్తులంతా పుణ్యస్నానాలు ఆచరించారు. ఇదిలా ఉంటే ఈ కుంభమేళాకు యూపీ ప్రభుత్వం ప్రగడ్బందీగా ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక గుడారాలు, టాయిలెట్లు ఏర్పాటు చేసింది. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసింది. ఇక తప్పిపోయిన వారి సమాచారం తెలియజేసేందుకు 24 గంటలు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య సౌకర్యాలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ కుంభమేళా జరుగుతుంది. అయితే ఈసారి ఊహించని రీతిలో భక్తులు రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పెట్రోల్, ఆహార కొరత ఏర్పడింది. ఇక జనవరి 26న మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మందికి పైగా మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఇక న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కూడా మరో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు అంటూ ప్రతిపక్షాలు

## మహాశివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి ..



ఖమ్మం, రాష్ట్ర ప్రజలు సభిక్షంగా ఉండాలని, ప్రపంచంలో తెలుగు ప్రజలు ఎక్కడున్నా క్షేమంగా ఉండాలని ఆ శివపార్వతులను వేడుకున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భార్య నందినితో కలిసి నేటి ఉదయం స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని పురాతన శివాలయంలో, మధిర నియోజకవర్గ కేంద్రంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు.

జాతరలో స్వీట్లు పంచుతూ..

శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఉప ముఖ్యమంత్రి పూజలు నిర్వహించారు. స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కుంభమేళా నుంచి వస్తుండగా ప్రమాదం

రాంచీ,కుంభమేళా నుంచి తిరిగొస్తుండగా బుధవారం తెల్లవారుజామున ఝార్ఖండ్ రాజ్యసభ ఎంపీ మహువా మాజీ వాహనానికి ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవగా రాంచీలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ ముక్తి మోర్చాకు చెందిన ఎంపీ మహువా తన కుమారుడు, కోడలితో కుంభమేళాకు వెళ్లి బుధవారం తెల్లవారుజామున తిరిగివస్తుండగా.. ఝార్ఖండ్‌లోని లతేహార్

## సంపాదకీయం

**గురువారం 27-02-2025**

# చారిత్రక ఘట్టంగా మహాకుంభమేళా

భారతదేశంలో మహోజ్వల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. 144 ఏళ్లకోమారు వచ్చే మహాకుంభమేళా మహాశివరాత్రి పర్వదినంతో ముగియనుంది. ఇప్పటికే 65కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి నట్లు యూపీ ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. శివరాత్రి బుధవారం మరింతమంది చేరితే అసలు లెక్కలు తేలుతాయి. అయితే పవిత్ర స్నానాలు ఆచరించిన వారి సంఖ్యను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ జనాభా భారత జనాభాకు సమానంగా ఉండడం విశేషం. దేశవిదేశాల నుంచి కూడా కోట్లాది సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, సిఎం యోగి ఆదిత్యనాథ్, ఏపి మంత్రులు పవన్ కళ్యాణ్, లోకేష్ దంపతులు ఇలా ఒక్కరేమిటి ఎందరో వివిఐపిలు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వల్ప ఘటనలు మినహా ఓ రకంగా కుంభమేళా అద్భుతంగా సాగిందనే చెప్పాలి. మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఒక్కటే కొంత ఆందోళనకు గురిచేసింది. రెండుమూడు చిన్నచిన్న ఘటనలు.. అంటే స్వల్ప అగ్నిప్రమాదాల్లాంటివి జరిగాయి. ఇవి మినహా అంతా ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు యూపి ప్రభుత్వాన్ని అభినందించ చాల్సిందే. దాదాపు రెండేళ్ల ముందునుంచే ఈ మహాఘట్టం కోసం ఏర్పాట్లు మొదలయ్యాయంటే . ఎంతగా జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ఆఖరిదశకు చేరింది. ఇవాళ్టి పర్వదిన స్నానాలతో ఈ మహాకుంభమేళా ముగియనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివెళు న్నారు. చివరి అమృత్ స్నానం కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రయాగ్‌రాజ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్ఠం చేశారు. భక్తులు స్నానాలకు ఇబ్బందులు లేకుండా తొక్కిసలాటలకు అవకాశం లేకుండా గట్టి ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్' గా అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మొత్తం ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతించనున్నట్లు ప్రకటించారు. యాత్రికులంతా ఈ మార్గదర్శకాలను పాటించాలని, అధికారులకు సహకరించాలని ప్రభుత్వం కోరింది. చివరి రోజు అమృత స్నానాల కోసం కోటి మందికిపైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లక్నో, ప్రతాప్‌గఢ్ వైపు నుంచి వచ్చే యాత్రికుల కోసం ఫాఫామౌ ఘాట్‌ను నియమించారు. రేవాన్, బండా, చిత్రకూట్, మిర్జాపూర్ వైపు నుంచి వచ్చే వారికోసం ఆరైల్ ఘాట్‌ను రిజర్వ్ చేశారు. కౌశాంబి నుంచి వచ్చే భక్తుల కోసం సంగం ఘాట్‌ను కేటాయించారు. మరోవైపు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే అన్ని ప్రధాన రహదారుల్లో పోలీసులు భారీగా మోహరించారు. వాహనాలు సాఫీగా ముందుకు సాగేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే.. 40 పోలీసు బృందాలు మోటార్‌బైక్‌లపై ఆయా మార్గాల్లో మోహరించారు. ప్రయాగ్‌రాజ్‌ను కలిపే ఏడు ప్రధాన రహదారుల్లో అదనపు డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారులు విధుల్లో ఉండనున్నారు.కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 64 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ ప్రకటించింది. ఇక చివరి రోజు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇదే సమయంలో గిన్నిస్ రికార్డు లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులు కుంభమేళా ప్రాంతంలో క్లీన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 15,000 మంది పారిశుధ్య కార్మికులు ఇక్కడ నాలుగు జోన్లలో క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ప్రయాగ్‌రాజ్ మేయర్ గణేశ్ కేసర్వాని, మహాకుంభ్ ప్రత్యేక ఈవో ఆకాంక్ష రాణా పర్యవేక్షించారు. ఈ రికార్డుకు సంబంధించిన వివరాలను మూడు రోజుల్లో వెల్లడించనున్నట్లు గిన్నిస్ రికార్డు ప్రతినిధులు తెలిపారు. 2019లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళా లో 10 వేల మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేయబోతున్నారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియ నుంది. దాదాపు 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివచ్చారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 63 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమ స్నానం ఆచరించారు. శివరాత్రి చివరిరోజుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. మొత్తంగా మహాకుంభ మేళాతో ప్రపంచం దృష్టిని భారత్ ఆకర్శించిందనడంలో సందేహం లేదు.

# "ఉచితా"ల మీద ఆగని రగడ




సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ కోర్టులో విచారణ సందర్భంగా ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలపై వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు పోటీపడి ఉచితాలు వాగ్దానం చేస్తున్నాయని, అది మంచి పద్ధతి కాదని, ఉచితాలను పంచి పెట్టటం వలన ప్రజలు పని చేయటం మానేస్తున్నారని, వుచితాలు పంచటం ద్వారా మనం పరాన్న భుక్కు వర్గాన్ని తయారు చేస్తున్నామా? అని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశ పెట్టటంతో ప్రజలు వుచితాల పైనే ఆధారపడుతున్నారని, పని చేయటానికి యిష్టపడటం లేదని, పని చేయకుండా వుచిత రేషన్ పొందుతు న్నారని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి వచ్చిన సీనియర్ లాయర్ ప్రశాంతి భూషన్ కలుగజేసుకొని చాలా మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తున్నది, సరైన పని దొరక్కపోవటం వల్లనే, కదా! అని అన్నారనుకోండి.ఒక్క జస్టిస్ గవాయ్ మాత్రమే కాదు. దేశంలోని సంపన్న వర్గాలన్నీ కలిసి పేదల మీద కత్తి కట్టాయి. ఉచితాల రద్దు కొరకు, పని గంటల పెంపు కొరకు పెద్ద యెత్తున ప్రచారం చేస్తున్నాయి. కార్పొరేట్ మీడియా వారికి వూడిగం చేస్తూ వుంది. మనదేశాన్ని ప్రపంచంలో నంబరు వన్‌గా తయారు చేయటానికే యిదంతా, అని అంటున్నారు. అంతిమ పరిశీలనలో యిదంతా వారి స్వార్థం కొరకేనని, దేశ ప్రయోజనం యిందులో యిసుమంతయినా లేదని తేలుతుంది. జస్టిస్ గవాయ్, తాను వ్యవసాయ కుటుంబాన్నుండి వచ్చినంత మాత్రాన తనకు వ్యవసాయం గురించి అంతా అర్థమౌతుందా? ఏది అర్థం కావాలన్నా, ముందు దాన్ని గురించి అధ్యయనం చేయాలి. వారు అధ్యయనం చేశారా? వారు చేశారో, చెయ్యలేదో నాకు తెలియదు. నేను కూడా వ్యవసాయ కుటుంబాన్నుండే వచ్చాను. ఉద్యోగానికి ముందు వ్యవసాయ పనులన్నీ చేశాను. వాటిలో వున్న కష్ట,నష్టాలన్నీ నాకు తెలుసు. అంతేకాదు, ఆరు సంవత్సరాల వ్యవధిలో రెండు దఫాలుగా గ్రామీణ ఆర్థిక, సామాజిక సర్వే నామిత్రులతో కలిసి చేశాను. ఆ సర్వే ఆధారంగా మీ ఉచితాల బండారం బయట పెడతాను.గ్రామాల్లో ఒక వ్యవసాయ కార్మిక కుటుంబానికి సంవత్సరంలో ఎన్ని దినాలు పని దొరుకుతుంది, స్త్రీలకు, పురుషులకు విడివిడిగా వివిధ సీజన్లలో యిచ్చే కూలిరేట్లు, కుటుంబంలో పని చేసే వారి సంఖ్య లాంటి వివరాలు సర్వేలో సేకరించాలి. ఈ వివరాలు వుపయోగించి వారి కుటుంబ సాంవత్సరిక ఆదాయాన్ని లెక్కించాలి. అట్లాగే ఆ కుటుంబానికి సంవత్సరం మొత్తంలో అయ్యే ఖర్చు లెక్కించాలి. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువని తేలితే ఆ కుటుంబం లోటులో వుందని అనుకోవాలి. అది పస్తుల పాలవుతున్న కుటుంబం అని అర్థం చేసుకోవాలి. లేదా, అప్పుల పాలవుతున్న కుటుంబం అని అనుకోవాలి. ఆ లోటుకు కారణం మాత్రం యీ కుటుంబంకాదు. ఆ లోటుకు కారణం వారిమీద జరిగే శ్రమదోపిడీ. లేదా కూలి వానికి తగినంత పని దొరికి వుండకపోవచ్చు. లేదా, రెండూ జరిగి వుండవచ్చు. యీ కారణాలలో దేనివలన అయినా యీ లోటు యేర్పడి వుండవచ్చు. ఆ లోటుకు కారణమైన వాళ్లే (దోపిడీదారులు) ఆ లోటును భర్తీ చేయాలి. అలాంటప్పుడు అది ఉచితమెలా అవుతుంది? అది దోచుకున్న సొమ్మును పూర్తిగా గాని, పాక్షికంగా గాని తిరిగి యివ్వటమే కదా! ప్రభుత్వం పేదలకిచ్చే రాయితీలు, తాయిలాలు, అన్నీ యీ శ్రమ దోపిడీ కారణంగా ప్రభుత్వం దగ్గర పోగుపడే సామాజిక మిగులు నుండే వస్తాయి. కాబట్టి అవన్నీయేవీ "ఉచితా"లు కాదు. అవి, కూలీల కష్టార్జితం మాత్రమే. అవి "వుచితా"లని మీరు భ్రమపడుతున్నారు.ఆరు సంవత్సరాల వ్యవధిలో మేము జరిపిన రెండు సర్వేల్లో, మొదటిది 2008లో జరిగింది. వుమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20 గ్రామాలు సర్వే చేశాము. డేటా ఎనలైజ్ చేస్తే వచ్చిన ఫలితాలలో మన విషయానికి సంబంధించినవి యీ విధంగా వున్నాయి. 1 గ్రామాల్లో భూమిలేని కుటుంబాలు దక్షిణ కోస్తా జిల్లాల్లో (ప్రకాశం జిల్లా మినహా) 70 నుండి 80 శాతం వరకు వున్నాయి. మిగిలిన జిల్లాల్లో అవి 40 నుండి 50 శాతం వరకు వున్నాయి. అంటే దక్షిణ కోస్తాలో అత్యధిక కుటుంబాలకు సెంటుభూమి కూడా లేదు. భూమిలేని వాళ్లు కూలిపని చేసుకోవలసిందే కదా! వ్యవసాయ కార్మికులు, పేదరైతుల సమాచారంతో పాటు యితర వర్గాల సమాచారం కూడా సేకరించాము. 2 గ్రామాల్లో సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసి 59.46శాతం, అంటే సుమారుగా 60శాతం కుటుంబాల వారున్నారు. వారి సగటు తలసరి, దినసరి ఆదాయాలు వరుసగా రు. 18.89లు, రు. 16.80లు, రు. 18.28లుగా లెక్క తేలింది. ఆనాటి ప్రొ.ఎ.అర్జున్ సేన్ గుప్తా కమిటి అంచనాల ప్రకారం దారిద్ర్య రేఖ హద్దు రు. 20/-లుగా లెక్క తేలింది. పై మూడు తరగతుల వారి తలసరి, దినసరి ఆదాయాలు రు. 20ల కంటే తక్కువే కాబట్టి వారంతా దరిద్రంలో వున్నట్లే లెక్క. గ్రామాలలో వారి కుటుంబాలు మొత్తం 60శాతం వున్నాయి. అంటే గ్రామాల్లో సగానికి పైగా కుటుంబాలు కనీసస్థాయి జీవనం కూడా గడప లేకుండా వున్నాయని అర్థం. వారు పస్థులుంటున్నారు. వారికి న్యూట్రిషన్ ఆహారం అందటం లేదు. అంటే, కనిష్టస్థాయి జీవనం గడిపే దానికి అవసరమైనంత ఆదాయం కూడా వారికి రావటం లేదు. వారి ఆదాయంలో లోటు వుంది. ఉచితాలందుకుంటున్న జనం వీరే. ఆ "ఉచితా"లు కూడా వీరి ఆదాయాల్లో యేర్పడే లోటును పూడ్చ లేకుండా వున్నాయి.ఆ రెండవ సర్వేకూడా 20 జిల్లాల్లో, 80 గ్రామాల్లో 2014లో జరిగింది. అంటే మొదటి సర్వే తరువాత 6 సంవత్సరాలకు జరిగింది. ఆ డేటాను విశ్లేషిస్తే యీ కాలంలో కూలీలు, పేదరైతుల పరిస్థితి మరింత దిగజారిందని తేలింది. 1) యీ ఆరు సంవత్సరాలలో భూకేంద్రీకరణ పెరిగింది. గతంలో 70 నుండి 80 శాతం కుటుంబాలకు భూముల్లేవని చూశాము. అది యిప్పుడు 75 శాతం నుండి 85 శాతానికి పెరిగింది. 2) యీ కాలంలో యాంత్రీకరణ గతం కంటే బాగా పెరిగింది అంటే, కూలీలకు పనిదినాలు తగ్గాయని అర్థం. 3) కౌలు రైతులు, సన్నకారు రైతులు కూలికి పోవటం యెక్కువ యింది. మొదటి సర్వే నాటికి సన్నకారు రైతుల మొత్తం ఆదాయంలో కూలి భాగం 37శాతం మాత్రమే. అది యిప్పుడు 63.8శాతానికి పెరిగింది. కౌలురైతులకు అది 37శాతం నుండి 58.2 శాతానికి పెరిగింది. అంటే రైతులు కూలి పనులకు పోవటం యెక్కువయిందనేగా దానర్థం. వీళ్లు కూడా కూలి పనులకు ఎగబడితే కూలీల మధ్య పోటీ పెరిగి కూలిరేట్లు తగ్గుతాయి. (రైతులు కూడా కూలి పనులకు పోవటం వాళ్లకదేమీ సరదా కాదు. యిళ్లు గడవకనే వాళ్లు కూడా కూలి పనులకు పోతున్నారు.) పనిదినాలు తగ్గితే, వారి ఆదాయాల్లోని కూలి భాగం తగ్గాలి కదా! తగ్గింది. మొదటి సర్వేలో వ్యవసాయ కార్మికుల మొత్తం ఆదాయంలో కూలి భాగం 88.6శాతం వుంటే, అది రెండవ సర్వేలో 53శాతానికి పడిపోయింది. యీ తగ్గిన భాగాన్ని కొంత వరకైనా పూడ్చుకోటానికి వాళ్లెన్ని

# జీవించే హక్కు అంటే.. పశు ప్రాయంగా బతకడం కాదు!

హైదరాబాద్,"బోగీల సామర్థ్యాన్ని మించి టిక్కెట్లు ఎందుకు అమ్మారు?" అన్న ప్రశ్నతో, ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట వ్యాజ్యం విచారిస్తున్న ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం, దేశ ప్రజలందరినీ బట్టలూడదీసి నిలబెట్టింది. "రూపాయి విలువ లేని రోజు రేపు వస్తుందట" అన్న కవి దాశరథి కల నిజం కాబోదు కానీ, ప్రాణానికి విలువ లేని అలగా జనం కథ కొనసాగుతూనే ఉంది.దేశంలో అడపాదడపా సామాన్యుల మృత్యు ఘంటికలు మ్రోగుతూనే ఉన్నాయి. ఆటోలు మొదలుకుని వివిధ ప్రయాణ సాధనాలలో, చివరికి వ్యక్తుల సొంత వాహనాలలో, అనుమతికి మించి ఉన్న ప్రయాణికులుంటే నేరం. సామర్థ్యానికి మించి వస్తు రవాణా చేస్తే అదీ నేరమే. అలా జరగకుండా చూడడానికి ప్రత్యేక యంత్రాంగాలు ఉన్నాయి. కానీ రైల్వే విషయానికి వస్తే, రైల్వే చట్టం సెక్షన్ 147 అక్రమంగా ప్రయాణికులు రైల్వే బోగీలలో ఎక్కడం లేదా?

సాధారణ టికెట్లకు పరిమితి లేదా?

చట్టబద్ధమైన హక్కు ప్రకారం టికెట్ కొని రైలు ఎక్కి, రైల్వే ఆస్తిని దుర్వినియోగం చేయడం చేస్తే, అది నేరమని, అందుకు ఆరు నెలలకు మించని జైలు శిక్ష, వెయ్యి రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చని, ప్రత్యేక పరిస్థితులలో, తగు కారణాలు ఉత్తర్వులలో పేర్కొంటూ, ఐదు వందలు దాటని జరిమానాతో సరి పెట్టవచ్చని మాత్రమే నిర్దేశిస్తుంది. దానర్థం బోగీల సామర్థ్యంతో నిమిత్తం లేకుండా ఎన్ని టికెట్లయినా రైల్వే అమ్ముకోవచ్చు. అంత్యోదయ ఎక్స్ ప్రెస్ రూట్స్‌లో కూర్చుని సుఖంగా ప్రయాణించడానికి సౌకర్యాలున్న, రిజర్వేషన్ సదుపాయం లేని, అన్నీ సాధారణ బోగీలే ఉన్న రైళు కూడా కొన్ని ఇప్పుడున్నాయి. కానీ, ప్రయాణికుల సంఖ్యను నియంత్రించే విధానం వీటిల్లోనూ లేదు. ఆదిలోనే, నిలబడటానికి కూడా అంగుళం స్థలం లేదని తెలిసినప్పటికీ, రిజర్వ్ చేయని సాధారణ టిక్కెట్ల జారీపై రైల్వే ఎటువంటి పరిమితిని విధించదు. అదే రిజర్వ్ చేసిన బోగీల విషయంలో వెయిటింగ్ జాబితా నిండిన తర్వాత టిక్కెట్లు ఇవ్వబడవు!

రెండు రకాల ప్రయాణికులతో..

నిజానికి రైలు ప్రయాణికులలో అత్యధికులు ప్రయాణించేది సాధారణ బోగీల్లోనే! మంది పడే ఇబ్బంది మనలాంటి వాళ్లకు ఏర్పడకుండా మాత్రం విధి విధానాలు ఉన్నాయి. ముందుగా ప్రయాణంలో బెర్తులు ఖరారు చేసుకున్న వారికే ఆ బోగీలలో ప్రవేశం. వేరెవరైనా బోగీలో ప్రవేశిస్తే, మనం ఫిర్యాదు చేయవచ్చు. తనిఖీల్లో పట్టుబడితే, బోగీ నుండి దింపేయవచ్చు. జరిమానాలు విధించవచ్చు. అంతేనా తగు మొత్తం చెల్లిస్తే మనం బజ్జోడానికి మెత్తలు పరిచిన బెర్తులు ఆహ్వానిస్తాయి. ఇంకొంచెం ఖర్చు పెట్టగలిగితే, ఎంచక్కా ఏ.సి. సౌకర్యంతో ప్రయాణించవచ్చు. తాజాగా ఉతికి ఇస్త్రీ చేసిన దుప్పట్లు, తలగడలు అమరుతాయి. అందులోనూ మళ్లీ పిండి కొద్దీ రొట్టె లాగా, మూడు, రెండు, ఒకటి తరగతులుంటాయి. అస్మదీయులకి అసౌకర్యం కలగకుండా చూడడానికి, ప్రత్యేకంగా మనతో పాటే ప్రయాణించే ఉద్యోగి కూడా ఉంటారు. అదే సయమంలో మనిషి కదలలేనంత కిక్కిరిసిన బోగీలలో, పాయిఖానాలలో, సామాన్లు భద్రపరచడానికి ఉద్దేశించిన పైనుండే చెక్క బల్లల పైన, కింద కష్టాలు పడుతూ, పిల్లలూ, వృద్ధులూ, రోగులు, గర్భిణీలూ సహా " దేవుడా నీవే దిక్కు" అనుకుంటూ రైలు ప్రయాణం చేస్తుంటే, కొండొకచో రైలు పెట్టెల కప్పు పైన




లేదా గుమ్మలకు వ్రేలా డుతూ ప్రమాదాలకు తావిస్తుంటే, సభ్య సమాజానికి చీమకుట్టినట్టైనా ఉండడం లేదు. వార్తా పత్రికలలో, వార్తా చానళ్లలో పతాక శీర్షికలూ, బ్రేకింగ్ న్యూస్‌లూ చదివీ, వినీ నిట్టూర్చడం, లేదా "తెల్లారి లేస్తే చావు కబుర్లే" అని విసుక్కోవడం తప్ప, "ఇదేం న్యాయం" అని ప్రశ్నించే బలమైన గొంతులే వినబడడం లేదు.

మనకు చీమకుట్టినట్టేనా ఉండదు!

బెంగళూరులోని ఒక సినిమా హాలు 30 నిమిషాలపాటు వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించి, ప్రేక్షకుల సమయాన్ని వృధా చేసిందని, అది అసమంజస వ్యాపార పద్ధతని ఒకరు ఫిర్యాదు చేస్తే, సంబంధిత జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్, ఫిర్యాదీ మానసిక వేదనకు పరిహారంగా ?.20,000/-, చట్టపరమైన ఖర్చులకు గాను మరో ?.8,000/, శిక్షాపరమైన నష్టపరిహారం కింద లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశించింది. మరి వినియోగదారుల పరిరక్షణ చట్టం సెక్షన్ 2(42) ప్రకారం తన ప్రయాణ నిమిత్తం రైల్వే టికెట్ ఉన్న ప్రయాణికుడు వినియోగదారుడుగానే పరిగణించబడతాడు. రైలు ప్రయాణికుల క్షోభ ముందు, ఈ ప్రేక్షకుని మానసిక వేదన ఏ పాటి? అయినా అదంతా చూసిన, తెలిసిన మనకి చీమకుట్టినట్టేనా ఉండదు! అనేక తీర్పులలో భారత సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగం ఆర్టికల్ 21 భారత పౌరులకు ప్రసాదించిన జీవించే హక్కు కేవలం పశు ప్రాయంగా బతకడం కాదని, అంతకంటే ఎంతో అధికమని, అది ప్రాథమిక హక్కు అని పలుసార్లు ప్రకటించింది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఖైదీలకు కూడా వర్తిస్తుందని, అంటే వారు ఖైదు చేయబడినప్పటికీ ప్రాథమిక మానవ గౌరవానికి అర్హులని భారత సర్వోన్నత న్యాయస్థానం తేల్చింది. మరి సాధారణ బోగీల ప్రయాణికులు ఇందుకు నోచుకోకపోయినా మనకు పట్టదు.

గౌరవ జీవనానికి భంగం కలగకుండా..

మన ఈ ఉదాసీనతకు, వారూ మన సాటివారు కాకపోయినా, మన తోటివారన్న స్పృహ లేనందుకు, అందరం సిగ్గుతో తలదించుకోవాలి. ఇప్పటికైనా పౌర హక్కుల సంఘాలు, దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే వినియోగదారుల సలహా సంఘాలు, శాసన కర్తలు, ఈ విషయమై తక్షణమే దృష్టి పెట్టాలి. నిర్దిష్ట కాలపరిమితితో సాధారణ బోగీలలోనూ రాజ్యాంగం నిర్దేశించిన గౌరవ జీవనానికి భంగం కలగకుండా ప్రయాణించే హక్కు ఆచరణ రూపం దాల్చాలి. అప్పుడే ఈ మూక(గ) జీవాలకు ముక్తి లభిస్తుంది.

# ఉత్సవాలకు ముస్తాబు...

కడప,జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రం పొలతల. పార్వతీ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ముస్తాబైంది. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామ పంచాయతీ శేషాచల పర్వత శ్రేణుల్లోని పాలకొండల్లో పొలతల మల్లికార్జునుడు కొలువై ఉన్నాడు. ఇక్కడికి వచ్చే భక్తుల కోర్కెలు తీరుస్తూ కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినం రోజు రాష్ట్ర నలుమూలల నుంచే కాక కర్ణాటక నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ క్షేత్రంలో మల్లికార్జునుడితో పాటు పార్వతీదేవి, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏడుగురు అక్కదేవతలు, పులిబండెన్న, వినాయక, సుబ్రమణ్యస్వామి, కాశిరెడ్డినాయనస్వాములు నిత్యం ప్రజలచే పూజలు అందుకుంటున్నారు. పొలతల క్షేత్రంలో గత కొన్ని సంవత్సరాల నుంచి కాశిరెడ్డినాయన ఆశ్రమం వారు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. కాశిరెడ్డినాయన కూడా ఈ క్షేత్రంలో పర్యటించి పూజలు నిర్వహిం చారని ఆలయ పెద్దలు తెలియజేశారు. మహాశివరాత్రి సందర్భంగా లక్షల మంది భక్తులకు అన్నిరకాల వంటలను అన్నదాన సత్రం సిద్ధం చేస్తుంది. పొలతలకు చేరే మార్గం పొలతలకు వెళ్లేందుకు ఆర్టీసీ వారు బస్సులను ఏర్పాటు చేశారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటిల నుంచి బస్సు సౌకర్యం కలదు. కడప నుంచి మూలవంక మీదుగా 22 కిలోమీటర్ల దూరంలో పొలతల క్షేత్రం ఉంది. పులివెందుల వైపు నుంచి వచ్చే వారు వెల్లటూరు మీదుగా చేరవచ్చు. పొలతల క్షేత్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకంతో పాటు 10 గంటలకు ముత్యాల తలంబ్రాలతో స్వామి వారి కల్యాణం ఉంటుందన్నారు. ఇకపోతే లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజస్వామి ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. మండలంలోని వంతాటిపల్లె గ్రామానికి 13 కిలోమీటర్ల దూరంలోని లంకమల అభయారణ్యంలో 600 ఏళ్ల క్రితమే ఉద్భవలింగం వెలసినట్లు ప్రచారం. ఈ ఉద్భవలింగానికి ప్రతినిత్యం సమీప కొలనులో అక్కదేవతల స్నానాలు చేసి ఎంతో పవిత్రంగా పూజలు నిర్వహించేవారని ప్రతీతి. 1500వ సంవత్సరంలో పెన్నానది ఒడ్డున ఉన్న మూలపల్లె గ్రామానికి చెందిన అయ్యవారురెడ్డి స్వామి బాలుడుగా ఉన్నప్పుడు గోవుల మందలో నుంచి ఒక గోవు అదృశ్యమై ప్రతిరోజూ ఉద్భవలింగం వద్దకు వెళ్లి పాలు ఇచ్చి వచ్చేది. ఆ దృశ్యాన్ని అయ్యవారురెడ్డి స్వామి చూసి మరుసటి రోజున ఆవును వెంబడించి ఉద్భవలింగం ఉన్న చోటును కనుగొన్నారు. ఈ గోవు పాలను ప్రతినిత్యం నిత్యపూజస్వామి స్వీకరించే వారని ఒక కథ ప్రచారంలో ఉంది. అనంతరం పరమేశ్వరుడు అయ్యవారురెడ్డి స్వామి వారికి నాలుకపై బీజాక్షరాలు రాసి భక్తుడిగా చేసుకున్నారని పూర్వీకులు చెబుతున్నారు. మహాశివరాత్రి పర్వదినాన, కార్తీక మాసాల్లో స్వామికి వైభవంగా పూజలు జరుగుతాయి. నిత్య పూజ స్వామి వద్దకు వెళ్లే భక్తులు మొదట పంచలింగాల స్వామికి పూజలు నిర్వహిస్తారు. అక్కడ చెన్నకేశవ స్వామి ఆలయం, అక్కదేవతల విగ్రహాలకు పూజలు చేస్తారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో కొండవాలు కింద వెలసిన ఉద్భవలింగం కొండ లోపలిభాగంలో శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిత్య పూజస్వామిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. భక్తులు పంచలింగాల గుడి వద్ద దారి పొడవునా అన్నదానం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తారు.

# బీజేపీ పరిస్థితి ఏంటి?

హైదరాబాద్,ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు కమలనాథులు.. గెలుపు అంత సులభం కాదు, ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదు అంటూ ఇటు అభ్యర్థులకు, అటూ కేడర్ కు దిశ నిర్దేశం చేస్తూ.. ఒక్కో ఓటరుకు, ఒక్కో ఇంచార్జ్‌ని నియమించి, పర్సన్ టూ పర్సన్ ఫార్ములాతో ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఎన్నికలు జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయ ఢంకా మోగించాలని పక్క ప్రణాళికలు రచించుకొని ముందుకు అడుగులు వేస్తోంది కాషాయ పార్టీ.. ఇంతకూ అనుకున్న లక్ష్యాన్ని బీజేపీ చేరుకుటుందా?

ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

రాష్ట్రంలో ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. ప్రచార గడువు కూడా మరి కొద్ది గంటల్లో ముగియనుంది. అందుకే బీజేపి పక్క వ్యూహం తో మూడు ఎమ్మెల్సీ స్థానాలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. ఒకవైపు ప్రచారంలో అగ్రనేతల జోరు కొనసాగుతోంది. మరోవైపు పట్టభద్రులు, ఉపాధ్యాయ సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగిస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మూడు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న కాషాయ పార్టీ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా అభ్యర్థులకు గ్రౌండ్ లెవల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు సహకరించడం లేదనే టాక్ వినిపిస్తోంది. అయితే అభ్యర్థులు మాత్రం గెలుస్తామనే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారంట.

90 శాతం ఓటర్లను కలిసామంటున్న బీజేపీ

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం కమల దళం కుస్తీ పడుతోంది. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కేడర్ మొత్తం రంగంలోకి దిగింది. ఇప్పటికే దాదాపు 90 శాతం వరకు ఓటర్లను కలవడం పూర్తయినట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఎన్నికల సరళిపై రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్చార్జి సునీల్ బన్సల్ ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వంతో పాటు, కేడర్ కు దిశ నిర్దేశం చేసుకొస్తున్నారు.

ఒక్కొక్క ఓటరుని 3 నుంచి 4 సార్లు కలుస్తున్న కాషాయ సేన

గెలుపు అనుకున్నంత సులభం కాదని, టఫ్ ఫైట్ ఉంటుందని, కష్టపడితేనే మూడు స్థానాల్లో గెలుస్తామని బన్సల్ తాను చేయించుకున్న సర్వే రిపోర్టులను బట్టి తేల్చి చెపుతున్నారంట. కావలిసింది ఓవర్ కాన్ఫిడెన్స్ కాదని, హార్డ్ వర్క్ ముఖ్యమని చెప్పుకొచ్చినట్లు సమాచారం. అందులో భాగంగానే ఒక్కొక్క ఓటరును మూడు నుంచి నాలుగు సార్లు నేరుగా ఫేస్ టూ ఫేస్ కలుస్తూ వారిని తమ వైపుకు తిప్పుకునేందుకు కాషాయ శ్రేణులు ప్రచారంలో బిజీ బిజీ గా ఉన్నారు. ఇక ప్రచారం గడువు ముగియనుండటంతో ప్రచారాన్ని మరింత జోష్ తో కొనసాగిస్తున్నారు.

స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం

ఈనెల 27న కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం కాషాయ పార్టీ చెమటోడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం తామేనని చెప్పుకునే బీజేపీ నేతలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు సవాల్ గా మారాయి. ఈ గెలుపే వచ్చే స్థానిక, జీహెచ్ఎంసి ఎన్నికలలో ప్రభావం చూపుతుందన్న అంచనాల్లో నాయకత్వం ఉంది. అయితే పార్టీ అభ్యర్థులు మాత్రం ఓవర్ కాన్ఫిడెన్స్‌తో అత్యుత్సాహం ప్రదర్శిస్తుండటంపై కాషాయ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి ఇదే అంశం బన్సల్ దృష్టికి వెళ్లడంతో అభ్యర్థులకు, ఇంచార్జీలకి, క్లాస్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# సైబర్ ఇంటెలిజెన్స్ నివేదికలో షాకింగ్ నిజాలు



హైదరాబాద్,జేబులో చెయ్యి పెట్టనక్కరలేదు.. గోడలు దూకాల్సిన పని అంతకన్నా లేదు.. తలుపులు బద్దలు కొట్టాల్సిన అవసరమే లేదు.. ఒక్క క్లిక్ తో లక్షలు హాంఫట్. ప్రస్తుత కాలంలో పెరిగిపోయిన సైబర్ నేరాల తీరిది. గుట్టుచప్పుడు కాకుండా, మనకే తెలియకుండా మన బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. దేశంలో సైబర్ నేరాలు అతి పెద్ద సమస్యగా మారాయి. సాధారణ నేరాల కంటే అత్యధికంగా నమోదవడమే కాకుండా కోట్ల రూపాయలు సొత్తు నేరగాళ్లు కాజేస్తున్నారు. మరి మన బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బు ఉందో నేరగాళ్లకు ఎలా తెలుస్తోంది? అనే ప్రశ్న తలెత్తవచ్చు. దీనికి సంబంధించిన మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ కు సైబర్ క్రైం ఇంటిలిజెన్స్ అధికారులు ఇచ్చిన నివేదిక విస్తుపోయే విషయాలను వెల్లడించింది.బ్యాంకులలో పనిచేసే వారి నుంచే నేరగాళ్లకు ఖాతాదారుల ఖాతా వివరాలు అందుతున్నాయని, సైబర్ నేరగాళ్లు నకిలీ బ్యాంక్ ఖాతాలు తెరవడానికీ కొందరు బ్యాంకు అధికారులు కూడా సహకరిస్తున్నారని నివేదికలో సైబర్ ఇంటిలిజెన్స్ టీం స్పష్టం చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖను, ఆర్బీఐ అధికారులను సైబర్ ఇంటిలిజెన్స్ టీం అలర్ట్ చేసింది.

ఏటేటా పెరుగుతున్న సైబర్ నేరాలు

పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగానే సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. వివిధ రకాల పద్ధతులను పాటించి నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. చదువులేని వారితో పాటు విద్యావంతులు, వ్యాపారస్తులు, సంపన్నులు కూడా వీరి వలలో పడి సొమ్ములను పోగొట్టుకుంటున్నారు. మోసాలు చేయడానికి సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులను ఎంచుకుంటున్నారు.అయితే, ప్రతీ ఏటా భారీగా నమోదవుతున్న సైబర్ నేరాల కట్టడికి ప్రజలు అప్రమత్తంగా ఉండడమే మార్గమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ముందస్తు అప్రమత్తత, కనీస రక్షణ చర్యలు తీసుకుంటే చోరీలను నివారించే అవకాశముంది. సైబర్ నేరాల్లో మాత్రం కొందరు తేలిగ్గా నేరగాళ్ల బుట్టలో పడిపోతున్నారు.పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లాంటి ఉదంతాల్లో ప్రాథమికంగా తక్కువ మొత్తాల్లో లాభాలు చూపించి రూ. కోట్లల్లో కొట్టేస్తున్నారు. నేరం జరిగాక సకాలంలో బ్యాంకు ఖాతాలు స్తంభింపజేసి డబ్బు ఇతర ఖాతాల్లోకి బదిలీ కాకుండా చూడడం, ఆ తర్వాత తగిన సాక్ష్యాధారాలు సేకరించి న్యాయ ప్రక్రియ పూర్తి చేసి బాధితులకు డబ్బు తిరిగి అప్పగించడం సుధీర్ఘ ప్రక్రియ. ఈ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని అసలు నేరాలు జరగకుండా జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అయితే సైబర్ నేరగాళ్లు అనేక రీతులలో వల విసురుతూనే వున్నారు .పోలీసు, సీబీఐ. ఆదాయపు పన్ను శాఖ అధికారుల పేరుతో కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీటి నియంత్రణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా బాధితులు పెరుగుతున్నారే గాని క్రైంరేటు తగ్గడం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో ప్రకారం గత ఏడాది 11 లక్షల పైగా సైబర్ ఫ్రాడ్ కేసులు నమోదయ్యాయి. పోలీలుల దృష్టికి రాని కేసులు కూడా వేలు, లక్షల సంఖ్యలోనే వుంటున్నాయి.

తెలంగాణలో సైబర్ నేరాల సగటు పెరుగుదల 10-15 శాతం

గత మూడేళ్ల గణాంకాలు పరిశీలిస్తే రాజధానిలో సగటున 9 నుంచి 10 వేల మధ్య ఇళ్లల్లో దొంగతనాలు, వాహన, సెల్?ఫోన్? చోరీలు రికార్డు కాగా సైబర్ నేరాల సగటు పెరుగుదల 10-15 శాతం కంటే ఎక్కువగా ఉంటోంది. బాధితులు పోగొట్టుకునే సొత్తు రూ. వందల కోట్లలో ఉంటోంది. ఒక్క 2023లోనే హైదరాబాద్ లోని మూడు కమిషనరేట్లలో కలిపి సుమారు రూ.450 కోట్లు పోగొట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే దొంగతనాలు, చైన్ స్నాచింగ్ తదితర కేసుల్లో కాజేసిన సొత్తు రికవరీ చేసేందుకు ఎక్కువ అవకాశాలుంటాయి. నిందితుల ప్రమేయం నేరుగా ఉండడం. సీసీ పుటేజీలు, వేలిముద్రలు, ఇతర సాంకేతిక ఆధారాలతో తేలిగ్గా చిక్కుతారు. అయితే సైబర్ నేరాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయో కూడా తెలువదు. సైబర్ నేరాల్లో రికవరీ రేటు మాత్రం సరాసరి 5 శాతం కూడా ఉండడం లేదు. నిందితులు కటకటాలు లెక్కించడమూ కష్టసాధ్యంగా మారుతోంది. ఉదాహరణకు హైదరాబాద్ కమిషనరేట్?లో గతేడాది చోరీ కేసుల్లో మొత్తం రూ.38.38 కోట్లు సొత్తు కాజేయగా పోలీసులు రూ.28.45 కోట్లు రికవరీ చేశారు. అంటే రికవరీ రేటు 74.15 శాతం. అదే సైబర్ నేరాల్లో రికవరీ సమస్యగా మారుతోంది. సైబర్ క్రైమ్ పోలీసులు అంచనా ప్రకారం తెలంగాణలోనే ప్రజలు సైబర్ నేరాల బారినపడి రోజూ సగటున రూ.3 కోట్లకు పైనే పోగొట్టుకుంటున్నారు. వాస్తవానికి సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టే సొమ్ము ఇంతకు 10 రెట్ల కంటే ఎక్కువగా ఉంటుందని కూడా పోలీసులు అంటున్నారు.ఒక్క హైదరాబాద్ లోనే రోజుకు రూ. కోటికి పైగా సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్తున్నాయి.

ఏపీలోనూ పెరిగిన సైబర్ నేరాలు

ఆంధ్రప్రదేశ్?లో గత మూడేళ్లలో సైబర్ నేరగాళ్లు రూ.940 కోట్లు కొల్లగొట్టినట్లు సైబర్ క్రైం పోలీసుల లెక్కలు చెబుతున్నాయి. వెంటనే స్పందించిన కేసులలో పోలీసులు రూ.8.26 కోట్లే తిరిగి రాబట్టగలిగారు. అంటే రికవరీ కేవలం 0.87 శాతమే. మరో రూ.140.40 కోట్లు బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయించారు. నేరగాళ్లు వేర్వేరు దేశాలు, వివిధ ప్రాంతాల్లో ఉంటూ మోసాలకు తెగబడుతుండటంతో వారిని పట్టుకోవటడం, సొమ్మును రికవరీ చేయటం పోలీసులకు పెద్ద సవాల్గా మారుతోంది. సైబర్ నేరాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోయింది. 2014-18 మధ్య ఏపీలో 3,572 సైబర్ నేరాలు నమోదు కాగా, 2019-23 మధ్య 9,849 కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. గడచిన సంవత్సరంలోనూ సైబర్ నేరాలు భారీగానే నమోదయ్యాయి.

కొత్త పద్దతులలో సైబర్ నేరాలు

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో నమోదైన ఫిర్యాదులను విశ్లేషించినప్పుడు అనేక రకాల నేరాలు వెలుగులోకి వచ్చాయి. అందులో కస్టమర్ సర్వీసు స్కామ్, వర్చువల్ అరెస్టు స్కామ్ ఎక్కువగా జరిగినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో అనేక మంది వర్చువల్ అరెస్టు స్కామ్ బారిన పడుతున్నారు. ఆధార్ కార్డును హ్యాక్ చేసి మోసాలకు పాల్పడేవారు ఇటీవల పెరిగారు. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా బాధితుడి బయో మెట్రిక్ సమాచారాన్ని హ్యాక్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు.మరోవైపు సోషల్ మీడియాను ఉపయోగించి చేసే మోసాలు పెరిగాయి.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఉద్యోగుల సహకారం

కేంద్ర హోంశాఖను సైబర్ ఇంటిలిజెన్స్ అందించిన నివేదికకు బలం చేకూర్చే కేసులను ఇటీవల తెలంగాణ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కొందరు బ్యాంకు ఉద్యోగులు దన్నుగా ఉంటున్నారు. ఖాతా వివరాలు అడిగో.. ఓటీపీ నంబరు అడిగో%ో% లేదంటే డిజిటల్ అరెస్టు అయ్యారని భయపెట్టో అమాయక ప్రజలను మోసం చేసి.. వారి నుంచి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లకు ఆ ఉద్యోగులే సహకరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాలను సృష్టించి ఆ దొంగ డబ్బు దాచుకునేలా వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకునేలా అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.తెలుగు రాష్ట్రాలు సహా గుజరాత్, కర్ణాటక, న్యూఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్లో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి 52 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. దీంతో బ్యాంకు ఉద్యోగుల సహకారం తేటతెల్లమైంది.

## కూటమి కరపత్రాన్ని గవర్నర్‌తో చదివించారు

విజయవాడ,శాసనసభ బ్జడెట్ సమావేశాల్లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం పూర్తిగా సత్యదూరమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు.. ప్రజల అంచనాలకు భిన్నంగా 30 మోసాలు, 60 అబద్దాలు అనే సామెతను తలపించిందని విమర్శించారు. మంగళవారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో షర్మిల మాట్లాడారు. గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని.. కూటమి కరపత్రాన్ని చదివించారని మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠం చూపించడం తప్ప.. మేనిఫెస్టో హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన ఎక్కడా లేదని అన్నారు. అందుకే ఈ నెల 28వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రజల ఆశయాలకు అద్దంపట్టేలా ఉండాలని,.. సూపర్ సిక్స్ హామీలను ఈ ఏడాది నుంచే అమలు చేసేలా నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. 8 నెలలు దాటినా ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇంకా ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలపై క్లారిటీ లేనే లేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ లాంటి మిగతా హామీలపై అసలు ప్రస్తావనే లేదని వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్ర పునర్ నిర్మాణం అంటూ కాలయాపన తప్పా.. పథకాలను అమలు చేస్తారని ఎదురుచూస్తున్న ప్రజలకు.. గవర్నర్ ప్రసంగం తీవ్ర నిరాశను మిగిల్చిందని అన్నారు. జలయజ్ఞం కింద చేపట్టిన దాదాపు 30 ప్రాజెక్టులు దశాబ్ద కాలంగా మూలుగుతుంటే .. వాటిని పూర్తి చేసే చిత్తశుద్ది కూడా కూటమి ప్రభుత్వానికి లేదని చెప్పారు. రూ.3వేల నిరుద్యోగ భృతి కోసం 50 లక్షల మంది యువత? 84 లక్షల మంది విద్యార్థులు తల్లికి వందనం పథకం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎకరానికి రూ.20 వేలు ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం కోసం 54 లక్షల మంది రైతులు.. ఉచిత ప్రయాణం, నెలకు రూ.1500 ఇచ్చే మహాశక్తి పథకం కోసం కోటి మంది మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. పేదవాళ్లకు సొంత ఇంటి కోసం చేపట్టిన టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్దిదారులకు అందించడం లేదని చెప్పుకొచ్చారు.

## సిట్ ఏర్పాటుకు కారణమేంటి?

అమరావతి,గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ప్రభుత్వం తేలిగ్గా వదిలే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. కిడ్నాప్ కేసులో అరెస్టు అయిన వంశీపై మరిన్ని కేసులు నమోదు చేయడంతో ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో నియోజకవర్గంలో చోటుచేసుకున్న అక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. వంశీ, ఆయన అనుచరుల దందాలను తవ్వి తీసేందుకు ఐజీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్పీలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. మరోవైపు గన్నవరం నియోజకవర్గంలో వంశీ బాధితులమంటూ పలువురు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నారు.వైసీపీ నేత వల్లభనేని వంశీకి ప్రభుత్వం వరుస షాకిలిస్తోంది. గన్నవరం నియోజకవర్గంలో మట్టి, ఇసుక మైనింగ్ ద్వారా వంశీ, ఆయన అనుచరులు కలిసి రూ,195 కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. దీనిపై దర్యప్తునకు ప్రభుత్వం ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడంతో వంశీని అన్నివిధాలా ఇరికించే ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. పక్కా ఆధారాలు సేకరించి వంశీకి ఉచ్చు బిగించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారం నోరుపారేసుకున్న వంశీకి నిజమైన పవర్ ఎలా ఉంటుందో చూపించాలనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందంటున్నారు.వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జిల్లాలో ఇష్టారాజ్యంగా కొండలను తవ్వేశారని వంశీపై విజిలెన్స్ నివేదిక సమర్పించింది. అనుచరులతో పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని అక్రమ దందాలకు పాల్పడ్డారని, కేవలం పానకాల చెరువు నుంచి రూ.100 కోట్ల విలువైన మట్టిని తవ్వించారని నివేదిక రెడీ చేసింది. ఇవికాక బెదిరింపులు, ఇతర అరాచకాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. సిట్ ఏర్పాటు తర్వాత కూడా ఆయనపై రూ.10 కోట్ల విలువైన భూ కబ్జాపై ఫిర్యాదు అందింది. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ లో విలువైన స్థలం కబ్జా చేశారని హైకోర్టు న్యాయవాది సతీమణి సుంకర సీతా మహాలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.మొత్తం ఎపిసోడ్ పరిశీలిస్తే వంశీని కష్టాలు చుట్టుముట్టినట్లే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కిడ్నాప్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని వేర్వేరు కేసుల్లో అరెస్టు చూపించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అన్ని కేసుల్లోనూ ఆయన బెయిల్ తెచ్చుకోవడం ఇప్పట్లో సాధ్యమయ్యే పనేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తానికి నోటితో విరుచుకుపడిన వంశీ పరిస్థితి దయనీయంగా మారిందన అంటున్నారు.గతంలో చెప్పిన అవాస్తవాలనే మళ్లీ చెబుతున్నారు. సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడుతారని భావించాం. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామనడం ఎక్కడా చూడలేదు. అబద్దాలను చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారు. 11 స్థానాల్లో గెలిచి ప్రతిపక్ష హోదా అడగడం హాస్యాస్పదం. సీనియర్లు కూడా జగన్‌కు వత్తాసు పలకడం దురదృష్టకరం అని అచ్చెన్నాయుడు తెలిపారు.

## సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్‌కు జీవిత ఖైదు

న్యూఢిల్లీ,1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్‌కుమార్‌కు ప్రత్యేక కోర్టు మంగళవారం జీవితఖైదు విధించింది. ఫిబ్రవరి 12న కోర్టు సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారించింది. అతని శారీరక, మానసిక ఆరోగ్యంపై నివేదిక సమర్పించాల్సిందిగా తీహార్‌జైలు అధికారులను ఆదేశించింది. జీవితఖైదు, ఉరిశిక్షలు విధించే కేసుల్లో ఇటువంటి నివేదికను కోరాల్సిందిగా సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 1984 సిక్కు మారణకాండలో తన భర్త, కుమారుడిని కోల్పోయిన బాధితురాలు తన పిటిషన్‌లో నిందితునికి గరిష్టంగా మరణశిక్ష విధించాలని అభ్యర్థించారు. 1984 అక్టోబర్ 31న ప్రధాని ఇందిరాగాంధీని సిక్కు బాడీగార్డ్సు హత్య చేసిన మరుసటి రోజు సిక్కులపై ఊచకోత జరిగింది. ఈ మారణకాండలో వేల మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు నిరాశ్రయులయ్యారు. ఈ కేసులో ఆయనకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అల్లర్ల సమయంలో సరస్వతీ విహార్ ప్రాంతంలో జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్‌ను హతమార్చారన్న కేసులో ఆయనను ఇటీవల దోషిగా తేల్చిన ప్రత్యేక న్యాయమూర్తి.. తాజాగా శిక్ష ఖరారు చేశారు. సిక్కు అల్లర్లకు సంబంధించిన మరో కేసులో ఇప్పటికే సజ్జన్ తిహాడ్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఇవేకాక ఆయనపై మరో రెండు కేసులు కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. 1984లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హత్య అనంతరం చెలరేగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో సజ్జన్ కుమార్ కేవలం భాగస్వామి మాత్రమే కాదని, అతడు ఒక బృందానికి నాయకత్వం వహించినట్లు కోర్టు ప్రాథమికంగా నిర్దారించింది.

## ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

అమరావతి,ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. తల్లికి వందనం సహా.. అనేక పథకాల అమలును ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. తల్లికి వందనం పథకం అమలు వ్యవహారంపై మాట్లాడిన సీఎం.. ఈ పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. పథకాన్ని అమలు చేస్తామన్నారు. మే నెలలో ఈ పథకం డబ్బులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. రైతుకు భరోసా కల్పించే విషయంలో తాము చెప్పినట్లుగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు సీఎం. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కేంద్రం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి యోజన రూ. 6000, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14 వేలు కలిపి మొత్తం రూ. 20వేలు ఇస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి మరోసారి ఉద్ఘాటించారు. ఇక దివ్యాంగులకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు పింఛను పెంచామన్నారు. సాధారణ పింఛన్‌ను రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచామన్నారు. రూ. 33 వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం పింఛన్లు ఇచ్చే దేశంలోనే ఏకైక కార్యక్రమం ఇది అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికీ సమయానికి జీతాలు ఇస్తున్నామని, ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నామని సీఎం చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. అన్న క్యాంటిన్లు మూసేశారని.. ఇప్పుడు తాము తిరిగి ప్రారంభించామన్నారు. పేదలకు దీపం కార్యక్రమం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చామని.. ఆ హామీని అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా 93 లక్షల మందికి దీపం 2 అందుతోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి డీఎస్సీ సెలక్షన్ పూర్తి చేసి బడులు తెరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక మత్స్యకారులకు సైతం అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు రూ. 20 వేలు ఇస్తామన్నారు. ప్రతి సంవత్సరం వారికి హాలిడే ఇస్తామని.. ఆ హాలిడే కంటే ముందుగానే ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామన్నారు. వైకాపా హయాంలో జరిగిన సభ కౌరవ సభ. కౌరవసభను గౌరవసభ చేశాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశా. గౌరవసభను అవమానించే పార్టీ ఇవాళ అసెంబ్లీలో లేకుండా పోయింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఎప్పుడూ చూడలేదు. సంప్రదాయాలను మరిచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజసమా? ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది మేం కాదు.. ప్రజలు. నిన్న వైకాపా నేతలు కేవలం 11 నిమిషాలే సభలో ఉన్నారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం మేం కలిసి పోటీ చేయలేదు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతోనే కలిసి పోటీ చేశాం. వైకాపా పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైంది. డబుల్ ఇంజిన్ సర్కార్ లేకుంటే రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయలేమని భావించాం. రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు 16,384 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. ఎంత మంది పిల్లలున్నా అందరికీ అమలు చేస్తాం. కేంద్ర పథకాలకు ఇచ్చిన గ్రాంట్‌ను కూడా గత ప్రభుత్వం వాడేసింది. జల్‌జీవన్ కోసం రూ.80వేల కోట్లు కావాల్సి ఉంటే.. గత ప్రభుత్వం కేవలం రూ.20వేల కోట్లు అడిగింది. అందరూ గర్వపడేలా రాజధాని నిర్మిస్తాం గత ప్రభుత్వంలో రంగుల పిచ్చి ఎక్కువయ్యింది.. సర్వే రాళ్లపైనా బొమ్మలు వేసుకున్నారు. పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే మా లక్ష్యం. ఇళ్లు లేని పేదలకు ఐదేళ్లలో ఇళ్లు నిర్మిస్తాం. గ్రామీణ పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం ఇస్తాం. ఉగాది రోజున పీ-4 విధానాన్ని ఆవిష్కరిస్తాం. 20లక్షల ఉద్యోగాల కల్పన మా ప్రభుత్వ బాధ్యత. రూ.6.50లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ పూర్తి చేశాం. తాజా పెట్టుబడుల ద్వారా 5లక్షల ఉద్యోగాలు వస్తాయి. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి ఇస్తాం'అని సీఎం బాబు ప్రకటించారు.

## రియల్‌రంగంలో ది బెస్ట్ స్టేట్.. దేశంలోనే రెండో స్థానంలో!




హైదరాబాద్,రాష్ట్రం మళ్లీ రియల్‌రంగంలో పునరుత్తేజం దిశగా ఎదుగొందుతోంది. రియల్‌రంగంలోని ఒక్కో రంగం ఒక్కో తీరుగా వెలుగులీనుతోంది. జిల్లాల్లో కొంతమేర ఆదాయం తగ్గినప్పటికీ మెట్రో నగరం హైదరాబాద్ నగరం రియల్ ఎస్టేట్ రంగంలో ప్రధానంగా ఆఫీస్ స్పేస్‌లో దేశంలోనే గొప్ప నగరంగా మారుతోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ రంగం కాస్త వెనుకబడినట్లు అనిపించింది. సేల్స్ నెమ్మదించాయి. కొత్త లీజింగ్ ట్రాన్సాక్షన్స్ తగ్గిపోయినట్లు పలు కన్సల్టెన్సీలు రిపోర్టులు వెల్లడించాయి. అయితే మళ్లీ ఇప్పుడు ఈ ఆర్థిక సంవత్సరం చివర్లో కార్యాలయ స్థలాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది.ప్రముఖ సంస్థలు తమ వ్యాపార విస్తరణ కోసం హైదరాబాద్ నగరాన్ని కీలక స్థానంగా భావిస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ పెరిగేందుకు ఇక్కడ ఉన్న మౌలిక సదుపాయాలతో పాటుగా అనుకూలంగా ఉండే వ్యాపార విధానాలు, స్థిర ప్రభుత్వం వంటివి తోడ్పడుతున్నట్లు నివేదిక పేర్కొంది.ఇంకా ఇతర ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే స్థిరాస్తి ధరలు అందుబాటులో ఉండటం.. నిపుణుల లభ్యత కూడా అనుకూలంగా ఉండటం వంటివి కారణంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌పై ఇన్వెస్టర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఇతర సంస్థలు కూడా సానుకూలంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.సమీప భవిష్యత్ విస్తరణ ప్రణాళికలకు వీలుండేలా చూసుకోవడం సహా ఆధునిక వసతులు, కీలక ప్రాంతాల్లోని గ్రేడ్ ఏ కమర్షియల్ ప్రాజెక్టులకు ఎక్కువ డిమాండ్ ఉందని రిపోర్ట్ తెలిపింది.అంతర్జాతీయ సంస్థల నుంచి డిమాండ్ పెరుగుతుండడం, పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతున్న తరుణంలో హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ అంచనాలకు మించి పెరిగిపోతుందని.. రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సర్వీసెస్ సంస్థ -సీబీఆర్ఈ వెల్లడించింది.ఈ సంస్థ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ప్రెసెస్ అసోషియేషన్ సంయుక్తంగా విడుల చేసిన నివేదికలో.. దేశీయంగా మిగతా నగరాలతో పోల్చితే ఆఫీస్ స్పేస్ కు హైదరాబాద్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారిందని ఈ నివేదిక వెల్లడిస్తోంది. రానున్న రోజుల్లో ఈ డిమాండ్ ఇలానే పెరుగుతూ.. 2030 నాటికి 20 కోట్ల చదరపు అడుగులకు చేరుకుంటోందని వెల్లడించింది.ప్రస్తుతం నగరంలో 1.37 కోట్ల చదరపు అడుగుల మేర ఆఫీస్ స్పేస్ వినియోగంలో ఉన్నట్లు తెలిపిన ఈ నివేదిక.. గత పదేళ్లతో పోల్చితే దాదాపు మూడు రెట్ల ఆఫీస్ స్పేస్ హైదరాబాద్ నగరంలో అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది.ప్రస్తుతం దేశంలో ఐటీ సహా ఇతర విభాగాల్లో అనేక సంస్థలున్న బెంగళూరు, దిల్లీ, చెన్నై వంటి నగరాల కంటే హైదరాబాద్ వైపు ఇంటర్నేషనల్ సంస్థలు ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు తెలిపిన సీబీఆర్ఈ నివేదిక.. ప్రధాన నగరాల్లో ఉన్న ఆఫీసు స్థలంలో హైదరాబాద్ వాటా 15శాతంగా ఉన్నట్లు వెల్లడించింది.ఇందులో 18శాతం గ్రీన్ సర్టిఫైడ్ ఆఫీస్ స్టాక్‌గా పేర్కొంది. హైదరాబాద్ నగరంలో 2024లో 1.23 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ బుకింగ్ అయ్యింది. ఇందులో.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలటిక్స్ వంటి రంగాలు ఎక్కువగా ఆఫీస్ స్పేస్ రెంట్‌కు తీసుకున్నట్లు వెల్లడైంది.మొత్తంగా టెక్నాలజీ సంస్థల వాటానే 31శాతంగా ఈ నివేదిక వెల్లడించింది. గతంలో ఐటీ రంగాలకు చెందిన సంస్థల నుంచి 30-35 శాతం డిమాండ్ ఉంటుండేది. కానీ.. ఇప్పుడు ఇతర రంగాల నుంచి సైతం పోటీ ఎక్కువ అవుతుండడం, ఆయా రంగాల సంస్థలు ఎక్కువగా ఆఫీస్ స్పేస్ రెంటుకు తీసుకుంటుండడంతో ఐటీ సంస్థల వాటా తగ్గిపోతున్నట్లు నివేదిక తెలిపింది.మొత్తంగా హైదరాబాద్ నగరంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా, బయో టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాల సంస్థలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు, ఇక్కర అద్దెలు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయి.రెండేళ్ల కాలంలోనే ఈ సంస్థల ఆఫీస్ స్పేస్ వినియోగంలో 12శాతం వృద్ధి రేటు నమోదైంది. గతేడాది ఆఫీస్ స్పేస్ తీసుకున్న మొత్తం సంస్థల్లో జీసీసీల వాటానే 43శాతంగా ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. ఈ సంస్థల ఏర్పాటులో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.జీసీసీల్లో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. గత ఏడాదిలో 53 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాన్ని జీసీసీలు అద్దెకు తీసుకున్నాయి.

రానున్న పదేళ్లలో 1.5 రెట్ల మేర పెరుగుదల

రానున్న ఐదేళ్లల్లో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ గిరాకీ 1.5 రెట్లు పెరుగుతుందని ఈ నివేదిక అంచనా వేస్తోంది. ఈ స్థాయిలో ఆఫీస్ స్పేస్ పెరగడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రధాన కారణమని విశ్లేషించిన నివేదిక.. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యపడుతోందని ప్రశంసించింది.మౌలిక సదుపాయాల అభివృద్ధిపై నిరంతరం దృష్టి సారించడంతో పాటు, ఆఐ, రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో పెరుగుతున్న పెట్టుబడులతో హైదరాబాద్ కు ఈ డిమాండ్ ఏర్పాటినట్లు తెలుపుతోంది.అలాగే.. ఇక్కడి బలమైన పర్యావరణ వ్యవస్థ, నైపుణ్యం కలిగిన యువత లభిస్తుండడంతో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ ఏర్పాటు సాధ్యమవుతోందని తెలిపింది. పైగా నగరంలో తక్కువ ధరల్లోనే అద్భుతమైన స్పేస్ అందుబాటులోకి రావడంతో పాటు ఇక్కడి వసతులు, వనరులు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకంగా పనిచేస్తున్నట్లు నివేదిక తెలిపింది.

## పండుగ రోజే ఫ్లైఓవర్ అందుబాటులోకి...


హైదరాబాద్,హైదరాబాద్‌వాసులకు మహా శివరాత్రి కానుక అందించనున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నగరంలో కొన్నేళ్లుగా నిర్మాణ దశలో ఉన్న అంబర్‌పేట ఫ్లైఓవర్ ఎట్టకేలకు పూర్తయిన నేపథ్యంలో.. బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు. అంబర్ పేట ఫ్లైఓవర్‌పై రేపటి నుంచి రాకపోకలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మంగళవారం ఉదయం అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను కిషన్ రెడ్డి పరిశీలించారు. గోల్నాక నుంచి అంబర్‌పేట ఇరానీ హోటల్ వరకు ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. చాదర్‌ఘట్ నుంచి వరంగల్ వెళ్లే జాతీయ రహదారికి.. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రోడ్డు విస్తరణ చేశారని.. కానీ అంబర్‌పేట ఛే నెంబర్ వద్ద రెండు వైపులా శ్మశాన వాటిక ఉండటం వల్ల రోడ్డు విస్తరణ కుదరలేదని తెలిపారు. తాను అంబర్ పేట శాసనసభ్యుడిగా, ఎంపీగా చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి.. శ్మశాన వాటిక ఉన్నందున ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని కోరానని చెప్పుకొచ్చారు. ఈ మార్గంలో విపరీతమైన రద్దీ ఉంటుందని.. స్థానిక ప్రజలు కూడా నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటారని తెలిపారు. ఈ జాతీయ రహదారి గుండా వెళ్లే వరంగల్, ఖమ్మం ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఫ్లైఓవర్ మంజూరు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అడగ్గా.. ఆయన వెంటనే ఒప్పుకొని మంజూరు చేశారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు.. ఫ్లైఓవర్ కింద రెండు వైపులా స్మశాన వాటికలు ఉండటం వల్ల.. రోడ్డు విస్తరణ ఇబ్బందిగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. అంబర్‌పేట ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి మిగతా ఐదు చోట్ల భూసేకరణ చేసి రోడ్డు విస్తరణకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకచోట భూసేకరణకు సంబంధించి రూ.2 కోట్ల 51 లక్షలు చెక్కు తీసుకున్న తర్వాత కూడా స్థలం నేషనల్ హైవే అథారిటికి అప్పగించలేదని గుర్తుచేశారు. దాన్ని త్వరగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కిషన్ రెడ్డి కోరారు. జీహెచ్ఎంసీ, నేషనల్ హైవే అధికారులతో ఇటీవల తాను ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్టు కిషన్ రెడ్డి తెలిపారు. ఫ్లైఓవర్ కింద మంచి రోడ్డు వేయడంతో పాటు, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చేయాలని అధికారులను సూచించినట్టు తెలిపారు. అయితే.. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సాధ్యం కాదని చెప్పారని వెల్లడించారు. ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ట్రాఫిక్‌ను పైనుంచి పంపిస్తూ.. కింద రోడ్డు, బ్యూటిఫికేషన్ పనులు చేయాలని అధికారులకు సూచించినట్టు వివరించారు. కాబట్టి మిగిలిపోయిన చోట్ల కూడా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి నేషనల్ హైవే అథారిటికి అప్పగిస్తే ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ శివరాత్రి నుంచి ఫ్లైఓవర్ మీనుంచి ట్రాఫిక్ వదిలి.. కింద

# రాజ్యసభకు కేజ్రీవాల్.. ఏ రాష్ట్రం నుంచంటే..!



న్యూఢిల్లీ,ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్.. పంజాబ్ ముఖ్యమంత్రి కాబోతున్నారంటూ ఆ మధ్య జోరుగా ప్రచారం జరిగింది. కానీ అందుకు పంజాబీయులు బయట వ్యక్తులను అంగీకరించబోరని తెలియడంతో కేజ్రీవాల్ వెనక్కి తగ్గినట్లుగా సమాచారం.అయితే ఈ ప్రచారాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సింగ్ తోసిపుచ్చారు.ఇదిలా ఉంటే తాజాగా పంజాబ్ కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా మరో ఆరోపణ చేశారు. కేజ్రీవాల్.. పంజాబ్ నుంచి రాజ్యసభకు వెళ్లబోతున్నారంటూ పేర్కొన్నారు. ఇటీవల ఈయన.. ఆప్‌కు చెందిన 32 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని బాంబ్ పేల్చారు. తాజాగా కేజ్రీవాల్.. రాజ్యసభ మార్గం వెతుకుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు పొలిటికల్‌గా సంచలనంగా మారాయి.ఇటీవల పంజాబ్‌లో ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ గోగి చనిపోయారు. ఈ స్థానంలో బైపోల్ జరగనుంది. ఈ ఎన్నిక ద్వారా కేజ్రీవాల్.. పంజాబ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వాలని చూశారని ఆరోపణలు ఉన్నాయి. వ్యతిరేకత కారణంగా ఆయన వెనక్కి తగ్గినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఉపఎన్నికలో ఆప్ రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోరాను బరిలోకి దింపాలని చూస్తున్నారు. లూథియానా వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో సంజీవ్ అరోరా పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే ఊహాగానాలు అందుకున్నాయి. ఇక ఈ రాజ్యసభ సీటు ఖాళీ అయితే.. ఈ స్థానంలో కేజ్రీవాల్ రాజ్యసభలోకి ఎంట్రీ ఇవ్వాలని భావిస్తున్నట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే కాంగ్రెస్ ఆరోపణలపై ఆప్ మాత్రం స్పందించలేదు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి పాలైంది. 70 అసెంబ్లీ స్థానాలకు గాను.. బీజేపీ 48, ఆప్ 22 స్థానాలు గెలుచుకున్నాయి. కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లాంటి నేతలంతా ఓటమి పాలయ్యారు. అతిషి మాత్రం అతి స్వల్ప మెజార్టీతో గట్టెక్కింది. ఇక ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా తెలంగాణ



హైదరాబాద్, ప్రతి ఏటా నిర్వహించే బయో ఏషియా సదస్సు హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హెల్త్ కేర్ రంగం భవిష్యత్ నిర్దేశించటంతోపాటు ప్రపంచానికే మార్గదర్శనం చేసేలా బయో ఏషియా దేశ విదేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు ఎన్నో హైదరాబాద్ నుంచి పనిచేస్తున్నాయని సీఎం చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బయో ఏషియా-2025 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. మేము ఇంతకాలం ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టాం. ఎందరో శాస్త్రవేత్తలు, శాస్త్ర, సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సమూహాన్ని తయారు చేశాం. జీనోమ్ వ్యాలీని కూడా ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియా సేవల రంగానికి ప్రాధాన్యమిస్తాం. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీతోపాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. దేశంలో ఇప్పుడు హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. కోర్ సిటీ వెలుపల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకూ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచంలోని అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా దీన్ని నెలకొల్పుతాం. ప్రపంచం నలుమూలాల నుంచీ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్.. ఈ రెండు రింగ్‌లను రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తాం. ఈ రహదారులకు ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి ఏపీలోని సీ పోర్టుకు అనుసంధానించేందుకు ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తాం. బయోసైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో పని చేస్తున్నాం. నిన్ననే హైదరాబాద్‌లో అమ్జెన్ సంస్థ తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది మా సహకారానికి నిదర్శనం. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, మా ప్రభుత్వ సహకారాన్ని అందుకోవాలని, మాతో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలు అన్నింటినీ ఆహ్వానిస్తున్నాం. సులభమైన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాలు, ఆశించినంత మద్దతు అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. ఇక్కడ అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికలోనూ తెలంగాణ రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాలలో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలోనూ రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు విస్తరించాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా గ్రామాలు అభివృద్ధి చేస్తున్నాం. ఐదు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలని ఆశిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ కింద కీలకమైన గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి. జర్మన్ కంపెనీ మి÷-టలెని బయోటెక్ జీనోమ్ వ్యాలీలో తన సెల్, జన్యు చికిత్సను ప్రారంభించింది. ఈ వేదిక పైనుంచి మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నాం. 25 సంవత్సరాల్లో ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా హైదరాబాద్ పేరు నిలుపుకుంది. గతేడాది ఏఐ హెల్త్‌కేర్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించాం. దేశవిదేశాల నుంచి బయో ఏషియా సదస్సుకు హాజరైన ప్రముఖుల గొప్ప మనస్సుకు అభినందనలు. మీరందరూ తెలంగాణను అనువైన వేదికగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా. జీనోమ్ వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డ్ పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని' చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ స్పా సెంటర్స్!

హైదరాబాద్: నగరానికి చెందిన ఓ ముఠా పశ్చిమ మండలంలోని స్పా సెంటర్లను టార్గెట్‌గా చేసుకుంది. ఆయా సెంటర్లకు కస్టమర్‌గా వెళ్లి, అసాంఘిక కార్యకలాపాల రంగు పూసి, సోదాలు చేసి, భయభ్రాంతులకు గురి చేసి, సెటిల్‌మెంట్‌కు పిలిచి, అందినకాడికి దండుకుంటోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ సహా అనేక చోట్ల పంజా విసిరిన ఈ ముఠా ఇప్పటికి దాదాపు రూ.50 లక్షల వరకు కొల్లగొట్టినట్లు సమాచారం. ఈ గ్యాంగ్‌కు కొందరు పోలీసులు కూడా సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఫోన్ చేసి, కస్టమర్‌గా వెళ్లి...

వెస్ట్‌జోన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్పా లేదా మసాజ్ సెంటర్ వద్ద రెక్కీ నిర్వహిస్తున్న ఈ ముఠా అనువైన దాన్ని టార్గెట్ చేసుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్‌లోనూ వీటిని ఎంపిక చేసుకుంటోంది. ఆపై దాని ఫోన్ నెంబర్ సేకరించే ఈ ముఠా సభ్యుడు నిర్వాహకులకు కాల్ చేస్తాడు. కస్టమర్ మాదిరిగా మాట్లాడుతూ ఆయా సెంటర్లు అందించే సేవలు, వాటి రుసుముల్ని తెలుసుకుంటాడు. ఈ తంతు పూర్తయిన తర్వాత వినియోగదారుడి మాదిరిగా ఆ సెంటర్‌కు వెళ్లే అతగాడు తనతో పాటు కండోమ్ ప్యాకెట్లు తీసుకువెళ్తాడు. ఇతడు వెళ్లే సమయంలో మిగిలిన ముఠా సభ్యులు ఆ సెంటర్‌కు సమీపంలోనే వేచి ఉంటారు. స్పా సెంటర్‌లోకి వెళ్లిన ముఠా సభ్యుడు అదును చూసుకుని తనతో తెచ్చిన కండోమ్ ప్యాకెట్లను మసాజ్ టేబుల్ కింద పడేస్తాడు. ఆ తర్వాత మిగిలిన వారికి సందేశం ఇచ్చి పోలీసుల మాదిరిగా రమ్మంటాడు.

దాడి చేసి, హడావుడి చేస్తూ....

ఈ సందేశం అందుకున్న వెంటనే సమీపంలో వేచి ఉన్న ముఠా సభ్యులు పోలీసుల మాదిరిగా ఆ సెంటర్‌పై దాడి చేస్తారు. తొలుత సీసీ కెమెరాలను ఆపేసి, వాటి దృశ్యాలు రికార్డు అయ్యే డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) స్వాధీనం చేసుకుంటున్నారు. స్పా మొత్తం సోదాలు చేస్తున్నట్లు నటిస్తూ తమ ముఠా సభ్యుడు ఉన్న గదిలోకి వెళ్తారు. అక్కడి టేబుల్ కింద పడి ఉండే కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతడితో పాటు థెరపిస్టును 'అదుపులోకి' తీసుకుంటారు. వీటి ఆధారంగా ఆ స్పాలో అసాంఘిక కార్యకలాపాలు



జరుగుతున్నాయంటూ హడావుడి చేసి నిర్వాహకులను పూర్తి భయభ్రాంతులకు గురి చేస్తారు. వాళ్లు పూర్తిగా తమ ట్రాప్‌లో పడ్డారని నిర్ధారించుకున్న తర్వాత మరో అంకానికి తెరలేపుతారు. ముఠాకు చెందిన ఓ సభ్యుడు స్పా సెంటర్ నిర్వాహకులకు సహాయం చేస్తున్నట్లు ముందుకు వచ్చి వారితో మాట్లాడతాడు. సెంటర్‌లో ఏ తప్పు జరగట్లేదని తాను నమ్ముతున్నానని, ఈ విషయాన్ని తాను సెటిల్ చేస్తానంటూ చెప్తాడు. అటు నిర్వాహకులు, ఇటు పోలీసులుగా వచ్చిన తమ ముఠా సభ్యులతో మాట్లాడుతూ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నాడు. ఈ తంతు మొత్తం అయితే అదే స్పా సెంటర్‌లో లేదంటే మరో ప్రాంతంలోని రెస్టారెంట్‌లో జరుగుతోంది. కాగా అప్పుడప్పుడు స్పా సెంటర్ల కేంద్రంగా జరిగే అసాంఘిక కార్యకలాపాలు వెలుగులోకి వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్‌తో పాటు శాంతిభద్రతల విభాగం అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి వివాదాలను క్యాష్ చేసుకుంటూ ఈ ముఠా తమ దందా కొనసాగిస్తోంది. ఇలా ఈ గ్యాంగ్ ఇప్పటి వరకు పశ్చిమ మండలంలోని పలు సెంటర్లపై పంజా విసిరి దాదాపు రూ.50 లక్షల వరకు కొల్లగొట్టినట్లు తెలిసింది. ఈ ముఠాకు సహకరిస్తున్న వారిలో కొందరు పోలీసులు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడితే రాజీనామా చేస్తారా



సిద్దిపేట,ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు. పనిచేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా అని ప్రశ్నించారు. మంగళవారం రఘునందన్ రావు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు. కార్ రేస్ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్ చేశారు. పాత సీఎస్ సోమేష్ కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్ గేట్ కుంభకోణంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్ రావు ప్రశ్నించారు. అంతకుముందు సిద్దిపేట కొండా భూదేవి గార్డెన్‌లో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలుపును ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. ఇద్దరు బీజేపీ అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. మిగతా పార్లమెంట్‌లలో కంటే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ ఓట్లు సాధిస్తామని అన్నారు. గతంలో గెలిచిన నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ పంచన చేరారు, కానీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. ఇతర పార్టీలో నాయకులను కొన్నట్లుగా బీజేపీ పార్టీ నాయకులను కొనలేరని మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఉద్ఘాటించారు. బీసీలలో ముస్లింలను రేవంత్ రెడ్డి కలిపారని ఆరోపించారు. నూటికి 55శాతం బీసీలు ఉంటే వారికి ఉన్న వాటా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా బీసీని ఎందుకు సీఎం చేయలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేంద్రమంత్రి పదవుల్లో బీసీలకు మోదీ పెద్దపీట వేశారని చెప్పారు. ఒక్క మైనార్టీకి కూడా కాంగ్రెస్ మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా ధామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్నటి సభలో బీజేపీ గెలుస్తుందని చెప్పకనే చెప్పారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 14నెలల్లోనే ప్రజల విశ్వాసాలను కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. తన కోసం మూడు రోజులు కష్టపడితే తాను ఆరేళ్లు మీ కోసం కష్టపడతా నిరుద్యోగులకు అండగా ఉంటానని మాటిచ్చారు. ఎమ్మెల్సీ జీతం నుంచి వచ్చే డబ్బులను పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి హామీ ఇచ్చారు.

# ఖర్మ కాలి టీడీపీ ఒక్కచోట ఓడినా.. కూటమికి కౌంట్‌డౌన్!



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో గురువారం మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికలు టీడీపీకి అగ్ని పరీక్షగా మారాయి. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఖర్మ కాలి టీడీపీ ఒక్కచోట ఓడినా, కూటమికి తొమ్మిది నెలలకే కౌంట్‌డౌన్ మొదలైనట్టే అనే చర్చ సర్వత్రా జరుగుతోంది. ఎందుకంటే రెండు పట్టభద్రల స్థానాల ఎన్నికలు 67 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించనున్నాయి.ఉమ్మడి గుంటూరు-కృష్ణా, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు సర్వం సిద్ధమయ్యాయి. ఒక్కో స్థానంలో రాజకీయ అనుకూలతలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.ఉత్తరాంధ్రలో ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మకు టీడీపీ, జనసేన . పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడికి బీజేపీ, అలాగే పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి యూటీఎఫ్, అంతర్గతంగా వైసీపీ మద్దతు ఇస్తున్నాయి. ఉత్తరాంధ్రలో యూటీఎఫ్ బలంగా ఉంది. మరీ ముఖ్యంగా విజయగౌరి ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనడంతో మంచి పేరు సంపాదించారు. మొత్తం ఓటర్లు 22,493 మంది. మహిళా ఉపాధ్యాయులు అత్యధికంగా విజయగౌరికి మద్దతు పలికే అవకాశం వుందని అంటున్నారు.మిగిలిన ఇద్దరు అభ్యర్థుల్లో రఘువర్మ సిటింగ్ ఎమ్మెల్సీ. గాదె శ్రీనివాసులునాయుడు గతంలో రెండుసార్లు ఎమ్మెల్సీగా పని చేశారు. అయితే ఈ ఇద్దరి పాలనారీతుల్ని ఉపాధ్యాయులు చూశారు. ఉపాధ్యాయులు, విద్యారంగం కోసం ఈ ఇద్దరు పని చేసిందేమీ లేదన్న విమర్శ బలంగా వుంది. ముగ్గురి మధ్య పోటీ నువ్వానేనా అని ఉన్నప్పటికీ, ఎక్కువ అవకాశాలు మాత్రం విజయగౌరికి ఉన్నట్టు మెజార్టీ అభిప్రాయం.ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానానికి గట్టి పోటీ నెలకుంది. ఇక్కడ టీడీపీ నుంచి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ తరపున డీవీ రాఘవులు పోటీ చేస్తున్నారు. ఇంకా చాలా మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ, ప్రధానంగా వీళ్లిద్దరి మధ్యే గట్టి పోటీ వుంది. టీడీపీ అభ్యర్థి కాపు , పీడీఎఫ్ అభ్యర్థి ఎస్సీ సామాజిక వర్గాలు. దీంతో ఆ జిల్లాల్లోని సామాజిక వర్గాలు ఇద్దరికీ కలిసి వచ్చే అవకాశం వుందని అంచనా. పీడీఎఫ్ అభ్యర్థికి వైసీపీ పరోక్ష మద్దతు తోడైంది. టీడీపీ అభ్యర్థికి కూటమి మద్దతు ఉన్నప్పటికీ, వాళ్లలో అసంతృప్తి నష్టం చేస్తుందనే భయం వుంది. ఇక్కడ గెలుపుపై ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారంటే, హోరాహోరీ ఏ రేంజ్‌లో వుందో అర్థం చేసుకోవచ్చు.ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల స్థానంలో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్య ప్రధానంగా పోటీ జరుగుతోంది. అయితే ఎక్కువ అవకాశాలు లక్ష్మణరావుకే ఉన్నట్టు క్షేత్రస్థాయి అభిప్రాయాలు తెలియజేస్తున్నాయి. అధికారికంగా వైసీపీ పోటీ చేయకపోయినా, టీడీపీని ఓడించాలన్న ఏకైక కారణంతో పీడీఎఫ్ అభ్యర్థికి ఓట్లు వేయనున్నారు. అంతేకాకుండా, లక్ష్మణరావు ఇప్పటికి నాలుగుసార్లు ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉంది. ఉద్యోగ, ఉపాధ్యాయ , విద్యారంగ సమస్యలపై చట్టసభలో గళమెత్తిన నాయకుడిగా మంచి గుర్తింపు వుంది.ఆలపాటిపై కూటమిలోనే వ్యతిరేకత వున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత డీఎస్సీ నిర్వహణలోనూ, అలాగే నిరుద్యోగ భృతి హామీని నిలబెట్టుకోవడంలోనూ, ఇటీవల గ్రూప్-2 పరీక్ష నిర్వహణలో ప్రభుత్వ ఉదాసీన వైఖరి, మరీ ముఖ్యంగా ఉద్యోగుల సమస్యల గురించి అసలు పట్టించుకోకపోవడంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ఇవన్నీ మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై ప్రభావం పడుతుందనే భయం టీడీపీని వెంటాడుతోంది. ఒక్కచోట ఓడినా నెగెటివ్ సంకేతాలు బలంగా జనంలోకి వెళ్లి, ఇక కూటమి సర్కార్ అని అయిపోయిందని అనుకుంటారనే భయం వాళ్లలో వుంది. ఒకవేళ మూడు చోట్లా ఓడిపోతే మాత్రం కూటమి సర్కార్ చాప చుట్టేయడం ఖాయం. గెలిస్తే, గండం గట్టెక్కినట్టే.

## తెలంగాణకు ఎక్కడ అడ్డుపడ్డానో రుజువు చేయగలవా

హైదరాబాద్,రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే తాను ఎప్పుడు ఎక్కడ తెలంగాణకు అడ్డుపడ్డానో రుజువు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పదవుల కోసం పార్టీలు మారి కాళ్లు పట్టుకొనే వాడిని తాను కాదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉంది.. ఆయన ఎలాంటి విచారణ చేస్తారో చేసి తమకు అప్పగించాలని కిషన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా సమాధానం ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో, జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు.

# చికెన్‌గున్యా వ్యాక్సిన్ తయారీకి బయోలాజికల్-ఈఫార్మా బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం

హైదరాబాద్,చికెన్ గున్యా వ్యాధి నివారణ కోసం బయోలాజికల్-ఈఫార్మా బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నది. పేద, మధ్య తరగతి ఆదాయం ఉన్న దేశాలకు.. చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను అందించాలన్న ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. బవేరియన్ కంపెనీతో కుదిరిన వ్యూహాత్మక ఒప్పందంపై .. హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్ కంపెనీ పత్రికా ప్రకటనలో పేర్కొన్నది. ఒప్పందంలో భాగంగా తొలుత టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ జరగనున్నది. ఆ తర్వాత వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. దిగువ, మధ్య ఆదాయ దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేయాలన్న టార్గెట్‌తో రెండు ఫార్మాల కంపెనీలు డీల్ చేసుకున్నాయి. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ తర్వాత.. రెగ్యులేటరీ ఆమోదం కోసం కంపెనీ ప్రయత్నించనున్నది. ఆ తర్వాత కమర్షియల్‌గా చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ఉత్పత్తి కేంద్రంలోనే వ్యాక్సిన్ తయారీ జరగనున్నది. బయోలాజికల్-ఈ సంస్థ దీని ద్వారా కొత్తగా 300 కొత్త ఉద్యోగాలను కల్పించనున్నది. చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు అందించాలన్న ఉద్దేశంతో ప్రాజెక్టును చేపట్టినట్లు బీఈ వెల్లడించింది. అమెరికాలో చికున్ గునియా వ్యాక్సిన్‌కు ఆమోదం దక్కింది. 12 ఏళ్ల వయసు పిల్లలు కూడా అక్కడ ఆ వ్యాక్సిన్ ఇస్తున్నారు. బవేరియన్ నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉన్నట్లు బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహిమా ధాట్ల తెలిపారు. దిగువ, మధ్య ఆదాయ దేశాల ప్రజలకు చికెన్ గున్యా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. వ్యాక్సిన్ ఉత్పత్తి విధానం, సక్సెస్‌ఫుల్ ట్రాక్ రికార్డు వల్ల.. బవేరియన్



నార్డిక్ కంపెనీతో ఒప్పందం కుదర్చినట్లు ఆమె తెలిపారు. తమ కంపెనీ వద్ద ఉన్న అడ్వాన్స్‌డ్, నిష్ణాత తయారీ టెక్నాలజీతో.. పేద దేశాల ప్రజలకు వ్యాక్సిన్‌ను అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. తమ ప్రయత్నం ద్వారా ప్రపంచవ్యాప్తంగా చికెన్ గున్యా వ్యాధి నియంత్రణలోకి వస్తుందని, తద్వారా ప్రజా ఆరోగ్య వ్యవస్థ బలపడుతుందని ఆశిస్తున్నట్లు మహిమ పేర్కొన్నారు. చికెన్ గున్యా వ్యాక్సిన్‌కు గ్లోబల్ యాక్సెస్ దక్కేందుకు.. బీఈతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బవేరియన్ నార్డిక్ కంపెనీ సీఈవో పాల్ చాప్లిన్ తెలిపారు. చిక్ వీఎల్‌పీ పేరుతో వ్యాక్సిన్ రూపొందిస్తున్నారు. దీన్నే వీఎల్పీ రికాంబినాంట్ ప్రోటీన్ వ్యాక్సిన్‌గా పిలుస్తారు. చికెన్ గున్యా వైరస్‌ను ఆ ప్రోటీన్ వ్యాక్సిన్ అదుపులోకి తీసుకువస్తుంది. 12 ఏళ్లు దాటిన వారికి ఈ వ్యాక్సిన్ ఇస్తారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com